అల్పాహారానికీ అవస్థలే!

కోట్ల వ్యయంతో రైల్వేస్టేషన్‌లో హంగులు, ఆర్భాటాలు చేస్తున్నా ప్రయాణికులకు కనీసం టీ, కాఫీ, అల్పాహారం, జనతా భోజనం దొరకని పరిస్థితి. తూర్పు కోస్తా జోన్, వాల్తేరు డివిజన్లలో దువ్వాడ రైల్వేస్టేషన్ ద్వారా వచ్చే ఆదాయం, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అల్పాహారం, భోజన సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు, ఆర్పీఎఫ్, రైల్వే సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ ఆవరణలో టిఫిన్, టీ, కాఫీ దొరుకుతుందని ప్రయాణికులు ఎవరైనా స్టేషన్‌కు చేరుకుంటే అవస్థలు పడాల్సిందే... – అగనంపూడి



బయట నుంచి తెచ్చుకున్న ఆహారం తింటున్న ప్రయాణికులు



మూసివేసిన అల్పాహారశాల

- కూల్‌డ్రింక్‌లకే పరిమితమైన క్యాటరింగ్ స్టాల్
- బయట నుంచి టిఫిన్లు, భోజనాలు తెచ్చుకోవాల్సిందే..
- దువ్వాడ రైల్వేస్టేషన్‌లో టీ కూడా దొరకని పరిస్థితి
- మూతపడిన అల్పాహార స్టాల్
- జీఎస్టీ, లైసెన్స్ ఫీజుల పెరుగుదలతో కాంట్రాక్టర్ల విముఖత



ఇళ్ల నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న ప్రయాణికులు

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో ఉదయం పూట మూడు రైళ్లకు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తారు. ఉదయం 6.50కి వచ్చే జన్మభూమి రైలుకు సాధారణ ప్రయాణికులు, డైలీ పాసింజర్లు, ఉద్యోగులు, విద్యార్థులు ప్రయాణం చేస్తున్నారు. రెండు నిమిషాల హాల్ట్ వ్యవధిలో ప్రయాణికులు ఎక్కలేని పరిస్థితి. దీంతో ఒక్కోసారి ఐదు నిమిషాల సమయం వరకు రైలును నిలిపేయాల్సిన పరిస్థితి. అలాగే బొకారో, సింహాద్రి రైళ్లకు అదేస్థాయిలో ప్రయాణికులు ఇక్కడి నుంచి వెళ్తుంటారు. మధ్యాహ్నం, సాయంత్రం తిరుమల, విశాఖ, గోదావరి, కాచీగూడ వంటి రైళ్లకు కూడా ఇక్కడి నుంచి ప్రయాణికులు రైళ్లను అందుకుంటున్నారు. చాలా మంది ప్లాట్‌ఫారాలపై అల్పాహారం, తేనేటి పానీయాలు అందుబాటులో ఉంటాయని వచ్చేస్తున్నారు. తీరా స్టేషన్‌కు చేరుకునే సరికి ఆ సదుపాయం లేకపోవడంతో ఆకలితో అలమటించాల్సిన పరిస్థితి. మరికొందరు కూర్మన్నపాలెం, రాజీవ్‌నగర్, అగనంపూడి కూడళ్లలో టిఫిన్లు కోసం ఆటోలు నిలిపి పార్సిల్ చేయించుకుంటున్నారు.

భారంతో క్యాంటీన్ మూత

క్యాటరింగ్ స్టాల్స్ ఉన్న రోజుల్లో ఉదయం దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అల్పాహారం, టీ, కాఫీ అందుబాటులో ఉండేవి. ప్రయాణికులు టిఫిన్లు చేసి, కాఫీ,టీలు సేవించేవారు. అయితే జీఎస్టీ, లైసెన్స్ ఫీజులు పెద్ద ఎత్తున పెంచేయడంతో లాభాలు తగ్గడంతో కాంట్రాక్టర్ విరమించుకున్నారు. తరువాత ఏ కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతో కొన్నాళ్ల నుంచి క్యాటరింగ్ స్టాల్ మూతపడింది. దీంతో చంటి పిల్లల పాల కోసం, వయో వృద్ధులు, ప్రయాణికులు టీ, కాఫీ, అల్పాహారం, జనతా భోజనం కోసం ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అధికారులు లైసెన్స్ ఫీజులు మెయిన్ స్టేషన్ మాదిరిగా కాకుండా తక్కువగా నిర్ణయిస్తే కాంట్రాక్టర్లు ముందుకు వస్తారని, లేని పక్షంలో ప్రయాణికులు ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు.



చిరుతిళ్ల స్టాల్

ప్రయాణికులను దృష్టిలో పెట్టుకోవాలి



ప్రయాణికుల ఇబ్బందులను అధికారులు దృష్టిలో పెట్టుకోవాలి. వేకువజామునే ఇళ్ల వద్ద టిఫిన్లు సిద్ధం చేసుకొని రైళ్లను అందుకోవడం కష్టం. ఈ పరిస్థితుల్లో గతంలో మాదిరిగా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో అల్పాహారశాలను కొనసాగించేందుకు ఏర్పాట్లు చేయాలి. మెయిన్ స్టేషన్ మాదిరిగా లైసెన్స్ ఫీజులు, జీఎస్టీ విధిస్తే కాంట్రాక్టర్లు భయంతో పారిపోతున్నారు. ఈ విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

–కండి సరోజిని, సామాజిక కార్యకర్త

స్టాల్ మూసేశారు



గతంలో ఉదయం పూట ఏ ట్రైన్‌కు వెళ్లినా దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై అందుబాటులో ఉండే టిఫిన్ చేసేవాళ్లం. రుచికరంగాడబ్బులకు సరిపడేవిధంగా టిఫిన్ ఉండేది. తర్వాత ఎందుకు ఈ స్టాల్‌ను ఎత్తివేశారో తెలియదు. అధికారులు స్పందించి అల్పాహారం, టీ,కాఫీలు అందుబాటులో ఉండేలా చొరవ తీసుకోవాలి.

–కె.పైడిరాజు, ప్రయాణికుడు

బయట నుంచి తెచ్చుకోవాల్సిందే



బయట నుంచి టిఫిన్లు, భోజనాలు తెచ్చుకోవాల్సి వస్తుంది. కనీసం ఇక్కడ పని చేసే వివిధ విభాగాల సిబ్బంది కూడా టీ, కాఫీ కోసం రెండు కిలోమీటర్లు దూరంలోని రాజీవ్‌నగర్ జంక్షన్ లేదా నాలుగు కిలోమీటర్లు దూరంలోని కూర్మన్నపాలెం నుంచి రప్పించుకోవాల్సి వస్తుంది. దువ్వాడ లాంటి అభివృద్ధి చెందుతున్న రైల్వేస్టేషన్ ఆవరణలో టీ, కాఫీ, టిఫిన్లు కూడా అందుబాటులో లేకపోవడం దారుణం.

–పి.పి.రామారావు, ప్రయాణికుడు

గేటు ఏర్పాటుకు అనుమతించాలని వినతి



విశ్వనాథన్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీను

గాజువాక: సుందరంగా నిర్మిస్తున్న పార్కుకు గేటు ఏర్పాటు చేసుకునేందుకు సనత్ నగర్ ప్రాంత వాసులకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం గాజువాక అధ్యక్షుడు జాగారపు శ్రీను కోరారు. ఆయన బుధవారం వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వంటిల్లు కూడలి నుంచి సమతానగర్ వరకు వెళ్లే రహదారిలో సనత్ నగర్ హరిణి ఆస్పత్రి వద్ద ఏర్పాటు చేస్తున్న పార్క్‌లోకి వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు వెళ్లడానికి వీలుగా గేటు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. అదే విధంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌కు కూడా ఆయన వినతిపత్రం అందజేశారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారని శ్రీను తెలిపారు.

అథ్లెటిక్స్ విజేతకు అభినందన



విజేత మోనాలిను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

అగనంపూడి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని కె. మోనాలికి రజత పతకం లభించింది. ఈనెల 9 నుంచి 11 వరకు చీరాలలోని వీఆర్‌ఎస్ అండ్ వైఆర్‌ఎన్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. మెకానికల్ మూడో సంవత్సరం చదువుతున్న మోనాలి 400 మీటర్ల రిలే పోటీల్లో రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఆమెను ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుధాకర్, రెక్టర్ డాక్టర్ వి. మధుసూదనరావు, రాంబాబు అభినందించారు.

23 నుంచి సీపీఐ మహాసభలు

పెందుర్తి: ఒంగోలులో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహా సభల్లో ప్రతీ ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వేపగుంట కూడలి వద్ద చిరువ్యాపారులతో కలిసి బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చేయాల్సిన పోరాటం గురించి మహాసభల్లో చర్చిస్తామన్నారు.

క్లుప్తంగా

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కేఎస్ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 26లోగా ఐటీఐ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీతో పాటు ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 27న ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించనున్న వెరిఫికేషన్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 29న ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ భూ నిర్వాసితులు ఆర్ కార్డు కలిగిన వ్యక్తులు దరఖాస్తులో క్యాస్ట్ అనే కాలమ్‌లో ఎస్పీ అని టైపు చేయాలని సూచించారు.

విశేషంగా అన్నసమారాధన



భక్తులకు అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఉరుకూటి చందు తదితరులు

పెదగంట్యాడ: గాజువాక వేణుగోపాల స్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా బుధవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, 70వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి చందు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉరుకూటి అప్పారావు, ఉరుకూటి బాబూరావు, రాంబాబు, పైడిరాజు, కనకరాజు, పల్లా నూకరాజు, కుంచుబాబు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముత్యాలు తదితరులు

పెదగంట్యాడ: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కాంగ్రెస్ అధికార ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు ఆధ్వర్యంలో నడుపూరు, గాజువాకలో రాజీవ్ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో ఎల్. రామారావు, వై. భూలోక, వర్మ, అప్పారావు, చిన్నారావు పాల్గొన్నారు.

భవనంపై నుంచి జారిపడి పెయింటర్ మృతి



కూర్మన్నపాలెం: భవనానికి పెయింటింగ్ వేస్తుండగా జారిపడి ఒక వ్యక్తి మృతి చెందాడు.మల్కాపురానికి చెందిన ఎ.రామకృష్ణ(55) ఈ ప్రమాదంలో మరణించినట్లు పోలీసులు తెలిపారు. దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని గల్లవానిపాలెంలో గ్రూపు హౌస్‌కు రామకృష్ణ పెయింటింగ్ వేస్తుండగా జారి పడిపోయాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో అగనంపూడి ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టంకు తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. స్టీల్ ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ హోంగార్డు కుసుమ తేజేశ్వరరావు, భార్య శైలజ, కుమారుడితో కలిసి బుద్ధ విహార్‌లో ఆవరణలోని గదిలో ఉంటున్నారు. శైలజ ఉక్కు జనరల్ ఆస్పత్రి వద్ద పాన్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఈనెల 18న రాత్రి నిద్రించిన శైలజ తెల్లవారి లేవలేదు. దీంతో భర్త విషయాన్ని ఆమె కుటుంబీలకు తెలియజేశారు. కుమార్తె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ పశ్చిమ గోదావరి జిల్లా మెట్లపాలేనికి చెందిన తండ్రి సుదర్శనరావు స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ ఎంపీ ఉమామహేశ్వరికేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు



నడుపూరులో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో తిప్పల దేవన్‌రెడ్డి, మంత్రి శంకరనారాయణ తదితరులు



మహిళకు కూటమి వైఫల్యాలను వివరిస్తున్న దేవన్‌రెడ్డి

- జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు
- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పలదేవన్‌రెడ్డి
- 76వ వార్డులో ఉత్సాహంగా బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ

పెదగంట్యాడ: తాను అధికారంలోకి వస్తే రెండింతలు సంక్షేమ పథకాలు ఇస్తానని ఎన్నికల్లో ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న మోసాలను ఇంటింటికీ తీసుకెళ్దామని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. జీవీఎంసీ 76వ వార్డు నడుపూరులోవార్డు అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో బుధవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దేవన్‌రెడ్డి కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలు.. వాటిని అమలు చేయని తీరును ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 14 నెలల కాలంలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా.. ఇదెక్కడి ప్రభుత్వం బాబూ .. అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇంటి వద్దకే రేషన్ నుంచి సంక్షేమ పథకాలు అందించారని.. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నా తమను పట్టించుకునే నాథుడే లేరని ప్రతి గడపలో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం కొందరికే, ఆడబిడ్డ నిధి, అన్నదాత సుఖీభవ, దీపం పథకం, 50 ఏళ్లకే పెన్షన్‌తో పాటు మరో వందకి పైగా పథకాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తే ప్రతి ఇంటా ఒకటే మాట వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకుండా తమను నిలువునా ముంచిందని.. జగనన్న ప్రభుత్వంలో పథకాలు బాగా అందినట్టు చెబుతున్నారని వెల్లడించారు. జగనన్న పాలనకు, చంద్రబాబు పాలనకు తేడాను ప్రజలు గుర్తించడంతో ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా..జగనన్నను ముఖ్యమంత్రిని చేద్దామని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు బ్రహ్మారెడ్డి, పెంటారావు, శరత్, తలారి నాగేశ్వరరావు, సన్నీ, శ్రీరామ రమణ, సన్యాసిరావు, వీవీఎస్ మూర్తి, కె. తాతారావు, ఎండా కృష్ణ, మూర్తి సృజన, రేవతి, శ్రీకాంత్, దేవి, ఖాదర్, పితాని పాత్రుడు, గొంప రామారావు, పిల్లి మహాలక్ష్మి, పల్లం పైడికొండ, నరసింగరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న అతిథులు, బ్రహ్మకుమారి ప్రతినిధులు

అగనంపూడి: బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఈ నెల 23న నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి ల్యాబ్ ఇన్‌చార్జి డాక్టర్ కె. సంతోషి రూప కోరారు. అగనంపూడి బీసీ కాలనీలోని బ్రహ్మకుమారి దివ్య జ్యోతి భవన్‌లో బుధవారం ఆమె రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మానవులకు పునర్జన్మ ఇవ్వడానికి రక్తదానం చేయాలని కోరారు. మౌంట్ అబూ నుంచి వచ్చిన రాజయోగి బి.కె. దిల్‌రెడ్డి మాట్లాడుతూ బ్రహ్మకుమారీల జాతీయ చీఫ్ ప్రకాశ్ మణిజీ స్మృతి దినం పురస్కరించుకుని నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ బి.కె. సోమేశ్వరి, బి. సత్యనారాయణ, కడిమి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రీ పెయిడ్ సర్వీసులో అధిక వసూళ్లు!



ప్రీ పెయిడ్ చార్జీల చార్టు

ఉక్కునగరం: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రీపెయిడ్ ఆటో సర్వీసులో అధికంగా వసూలు చేస్తున్నారని స్టీల్ ప్లాంట్ ఓబీసీ అసోసియేషన్ నాయకుడు దొడ్డి సన్నిబాబు ఆరోపించారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసినట్టు ప్రచారం చేశారని.. ఆటోవాలాలు మాత్రం పాత చార్జీలే వసూలు చేస్తున్నారన్నారు. దువ్వాడ స్టేషన్ నుంచి కూర్మన్నపాలేనికి ప్రీ పెయిడ్ చార్జీ రూ. 40 నిర్ణయించగా రూ.90 వసూలు చేస్తున్నారన్నారు. ఈ అంశంపై అక్కడ ఉన్న పోలీసు వారికి ఫిర్యాదు చేసినా నిస్సహాయత వ్యక్తం చేశారన్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి చార్టు ప్రకారం చార్జీలు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఆచార్య నరసింహారావు

విశాఖ విద్య : విద్యార్థులు చదువుతోపాటు సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఏయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు సూచించారు. వర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ విద్యార్థులు బమ్మిడి రజిని, వనం కళ్యాణ్ యూనివర్సిటీ లెవెల్ బెస్ట్ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్స్‌గా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నరసింహారావు, విభాగాధిపతి ప్రొఫెసర్ జాలాది రవి, జాతీయ సేవా పథకం ప్రొగ్రామ్ అధికారి బోరుగడ్డ సుబ్బయ్య అవార్డు అందుకున్న వలంటీర్స్‌ను అభినందించి సన్మానించారు. ప్రిన్సిపాల్ నరసింహారావు మాట్లాడుతూ ఆర్ట్స్ కాలేజ్‌కు అవార్డులు రావడం చాలా సంతోషకరమన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అంటేనే సేవా భావంతో ఉంటారని తెలియజేశారు. ప్రొఫెసర్ జాలాది రవి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌ను ప్రారంభించిన తర్వాత యూనివర్సిటీలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని, వీరికి అవార్డులు రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రొగ్రాం అధికారి బోరుగడ్డ సుబ్బయ్య మాట్లాడుతూ అవార్డు అందుకున్న విద్యార్థులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో జరిగే అడ్వెంచర్ క్యాంప్, కల్చరల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ వంటి వివిధ పోటీల్లో పాల్గొని ఎన్నో పతాకాలు సాధించారన్నారు. వారికి అవార్డులు రావడం కాలేజీకి గర్వకారణమన్నారు.

సిరులతల్లికి శ్రావణలక్ష్మి పూజలు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు బుధవారం 27వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టు ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు నిర్వహించి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం ఇద్దరు దాతలు విరాళాలు అందజేశారు. నగరంలోని ఆశీల్‌మెట్టకు చెందిన వరద కమలాకర్, అపర్ణ దంపతులు రూ.లక్ష 11వేల 116, విజయనగరం జిల్లా సాలూరుకు చెందిన నరసింహ విశ్వనాథరాజు, గుణమణిదేవి దంపతులు లక్ష 116 విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలోని డొనేషన్ కౌంటరులో సంబంధిత విరాళాన్ని వారు బుధవారం నగదు రూపంలో చెల్లించారు. దాత విశ్వనాథరాజు దంపతులకు ఈవో వి.త్రినాథరావు, కమలాకర్ దంపతులకు డిప్యూటీ ఈవో సింగం రాధ బాండ్‌లను అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్ త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఉక్కు యాజమాన్యం తీరు వల్లే ఉత్పత్తి తగ్గుదల

ఉక్కునగరం: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో మూడు రోజులుగా బ్లాస్ట్ ఫర్నేస్‌లో ఉత్పత్తి తగ్గడానికి ఉక్కు యాజమాన్యమే బాధ్యత వహించాలని స్టీల్ సీఐటీయూ అధ్యక్షుడు వై.టి. దాస్ అన్నారు. ఈ సమస్యకు కింది స్థాయి అధికారులను, కార్మికులను బాధ్యులను చేయడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఉత్పత్తిని పెంచుతామని, లాభాల్లో నడుపుతామని ప్రకటించిన ప్రభుత్వం, యాజమాన్యం ఇప్పుడు ఉత్పత్తి ఎందుకు తగ్గిందో సమాధానం చెప్పాలని దాస్ డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్‌లో పాడైన యంత్రాలను ఎందుకు మార్చలేదని ఆయన ప్రశ్నించారు. అలాగే, కన్వేయర్ల నిర్వహణను ప్రైవేటుపరం చేసిన 'టీఎంసీ' ఎందుకు విఫలమైందో యాజమాన్యం వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనుభవం ఉన్న పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి, అనుభవం లేని ఇతర రాష్ట్రాల వారిని నియమించడం వల్ల ఈ సమస్యలు తలెత్తుతున్నాయని దాస్ ఆరోపించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్ఎంహెచ్‌పీ విభాగంలో ముడి సరుకు సరఫరా నిలిచిపోయిందన్నారు. దాన్ని సరిచేయడానికి కాంట్రాక్ట్ కార్మికులు లేకపోవడం ఈ నష్టానికి కారణమని ఆయన అన్నారు. ఈ నష్టానికి కేంద్ర ప్రభుత్వం, ఉన్నత యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. దిగువ స్థాయి అధికారులపై నెపం నెడితే సహించేదిలేదన్నారు.